నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

1 | హైదరాబాద్, ఆదివారం 15 జూన్ 2025 | SANGAREDDY


## రైతుభరోసా పేరుతో మోసానికి కాంగ్రెస్ యత్నం



గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- **బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, జూన్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా రైతులను మోసగించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికోసమే రైతుభరోసా వేస్తామంటూ మరో సారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరుగ్యారెంటీలు, వందల కొద్దీ ఇచ్చిన హామీలు అటకెక్కినట్లు విమర్శించారు. గతేడాది వానకాలం, యాసంగి రైతు భరోసా ఎగ్గొట్టారన్నారు. కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి డైవర్షన్ రాజకీయాలు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్నట్లు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలుపై మాజీమంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వెన్నులో వణకు పుడుతున్నదని ఎద్దేవా చేశారు. ఫార్ములా ఈ కారు రేస్‌తో రాష్ట్ర ఖ్యాతిని పెంచింది కేటీఆర్ అని, హైదరాబాద్‌కు ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చింది కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. అందాల పోటీలతో దేశ ప్రతిష్టను రేవంత్ మంటగలిపారన్నారు. రేవంత్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఓటుకు నోటు కేసు శుక్రవారం ఉండగా రేవంత్‌రెడ్డి గౌర్హాజరు అయ్యారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు స్వామిచారి, అహ్మద్ పాల్గొన్నారు.

## పాలన చేతగాక కక్షసాధింపు చర్యలు



బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- **బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి**

రామాయంపేట, జూన్ 14: పాలన చేతగాక కాంగ్రెస్ సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ముంబయిలో సముద్రంలో గల్లంతై మరణించిన వ్యక్తి కుటుంబాన్ని శనివారం రామాయంపేటలో పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నర్సింలు కుటుంబానికి బీఆర్‌ఎస్ నుంచి రూ.2లక్షల చెక్కు మృతుడి భార్యకు అందజేశారు.ఇటీవల నారోగ్యానికి గురైన బీఆర్‌ఎస్ కార్యకర్త పరుపుగల్ల యాదగిరిని పరామర్శించారు. అనంతరం పద్మాదేవేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట 420 హామీలిచ్చి నేడు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. వానకాలం వచ్చినా రైతుభరోసాకు దిక్కులేదన్నారు. కక్షసాధింపుల్లో భాగంగానే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని, అధికారులకు సమాధానం చెప్పి వచ్చినప్పటికీ మళ్లీ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఆమె వెంట రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, ఐలయ్య, ఎస్‌కే హైమద్, అస్నోద్దీన్, కృష్ణాగౌడ్, చింతల రాములు, రాజు యాదవ్, ముత్తరగల్ల కిషన్, నిజాంపేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మల్లేశం, సుభాష్ నాయక్, కొండల్‌రెడ్డి, ఉమామహేశ్వర్ ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగెత్తిన ప్రజలు



గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

- **జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**

జహీరాబాద్, జూన్ 14: కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. హామీల అమలును సీఎం రేవంత్ గాలికి వదిలేశారని విమర్శించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని అల్లీపూర్‌లోని ఫయాజ్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. జహీరాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్ ఆధ్వర్యంలో షేక్ ఇస్మాయిల్ మిత్ర బృందం పార్టీలో చేరింది. ఎమ్మెల్యే మాణిక్‌రావు వారికి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నట్లు విమర్శించారు. మైనార్టీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించక పోవడంతో వారిపై హస్తం పార్టీకి ఉన్న ప్రేమ, చితశుద్ధి ఏంటో అర్థమైందన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, పార్టీ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, మహ్మద్ అలీ, శంకర్ పాటిల్, అబ్రహం, హీరురాథోడ్, మోహన్ రెడ్డి, జగదీశ్, సత్తార్ సాబ్, మల్లేశం, శ్రీకాంత్, స్వామిదాస్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతలు.. ప్రయాణానికి తంటాలు



గుంతలు, బురదమయంగా మారిన ధనూర–జోగిపేట రోడ్డు

టేక్మాల్, జూన్ 14: రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణించాలంటే వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. టేక్మాల్ నుంచి జోగిపేటకు వెళ్లేందుకు రోడ్డును విస్తరించి తారురోడ్డు వేశారు. ధనూర గ్రామ శివారులో బ్రిడ్జి నిర్మాణం చేసినప్పటికీ అక్కడ తారురోడ్డు వేయలేదు. మట్టి రోడ్డు కావడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు గుంతల్లో చేరడంతో రోడ్డంతా బురదమయంగా మారింది. ఈ దారిన ప్రయాణించే వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బైక్‌పై వెళ్లే వారు అదుపు తప్పి కింద పడిపోయి గాయాల పాలవుతున్నారు. నిత్యం వ్యాపారులు, ఉద్యోగులు, ఇతరత్రా అవసరాల నిమిత్తం జోగిపేటకు ఈ దారిన వెళ్తుంటారు. కారులో వెళ్లేవారు బొడ్మట్‌పల్లి నుంచి తిరిగి వెళ్తుండగా, ఆటోలు, బైక్‌లపై వెళ్లేవారు మాత్రం ఈ దారిననే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. అలాంటిది రోడ్డు గుంతలుగా, బురదమయంగా మారడంతో ఈ దారిన ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్


మిరుదొడ్డి, జూన్ 14: సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హైమావతిని శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సిద్దిపేట కలెక్టర్ హైమావతికి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బక్కి వెంకటయ్య



# కొత్త కలెక్టర్లకు సమస్యల స్వాగతం!




హైమావతి, సిద్దిపేట కలెక్టర్

ప్రావీణ్య, సంగారెడ్డి కలెక్టర్

### జిల్లా బాస్‌లు ప్రజలతో మమేకం అయ్యేనా..

సిద్దిపేట, జూన్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు తీసుకున్న హైమావతికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. మూడు రోజుల క్రితం ఐఏఎస్‌ల బదిలీలు జరగగా, వీరిద్దరు సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్లుగా నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగింది. సంక్షేమం ఫలాలు అర్హులకు అందాయి. నిత్యం ఏదో కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు. దీంతో బీఆర్‌ఎస్ హయాంలో పాలనలో హడావిడి కనిపించేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాకు తీవ్రంగా అన్యాయం జరుగుతున్నది. ఆశించిన మేర నిధులు రావడం లేదు. పథకాలు సంపూర్ణంగా అందడం లేదు. అంతేకాకుండా యంత్రాంగంలో ఒక విధమైన నిర్లిప్తత నెలకొంది. పాలన ఉండా లేన్నట్లు పరిస్థితి ఉంది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారుల పర్యవేక్షణ ఆశించిన మేర లేదని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాల్లో భారీగా అవినీతి పెరిగిపోయింది. ధాన్యం కొనుగోలులో భారీగా అక్రమాలు, జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారుల వేధింపులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. జిల్లాలోని కీలక శాఖల్లో అవినీతి పెరిగి పోయింది. ఇటీవల జిల్లా వైద్యారోగ్య శాఖలో నిధుల గోల్‌మాల్ అయ్యాయి. మున్సిపల్ శాఖలో అంతు లేని అవినీతి చోటు చేసుకుంటుంది. విద్యుత్ అధికారుల అవనీతికి అంతు లేకుండా పోయింది.ఏ చిన్న పని కావాలన్న పైసలు ఇస్తేనే అవుతున్నాయి. విద్యుత్ లైన్ వేయకుండానే వేసినట్లు రికార్డులు సృషించి ఇష్టానుసారంగా కేబుల్, విద్యుత్ స్తంభాలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇక చెప్పాల్సిన అవసరం లేదు. లంచాలు ఇస్తే ఏదైనా పనిచేసి పెడుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలోని అధికారులను మామూళ్ల కోసం ఒత్తిడి చేస్తున్నారు. టూర్‌ల పేరిట ఆ గ్రామాలకు వెళ్తే కిందిస్థాయి ఉద్యోగులు ఎంతో కొంత తడపాల్సిందే. అలా ఇవ్వకపోతే ఇబ్బందులు గురిచేస్తున్నారు. సివిల్ సప్లై అధికారుల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన శాఖల్లో సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం కొత్త కలెక్టర్లపై ఎంతైనా ఉంది. పాలనను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. ఆయా శాఖల్లో జరుగుతున్న అవినీతిని కట్టడి చేసి..ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత కొత్త కలెక్టర్లపై ఉంది.

#### పలు కీలక శాఖల్లో అవినీతి...

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పలు శాఖల్లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని శాఖల్లో అవినీతి బాగా పెరిగిపోయింది. ఉన్నతాధికారులే అవినీతికి పాల్పడడంతో కింది స్థాయి అధికారులు అదే దారిలో పోతున్నారు. ఆయా శాఖలపై అధికారుల నియంత్రణ కరువైంది.క్షేత్ర స్థాయిలో సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రెవెన్యూ శాఖ పూర్తిగా అవినీతి కంపులో కూరుకుపోయింది. తహసీల్దార్లు తమ కార్యాలయాల్లోనే పైరవీకారులతో పనులు చక్కబెడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వాటిపై చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం భూములు కబ్జాకు గురై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం కావడంతో, రాష్ట్ర రాజధానికి దగ్గరగా ఉండడంలో ఇక్కడి భూములకు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ భూములు వందల ఎకరాలు ఇప్పటికే అన్యాక్రాంతం అయ్యాయి. తహసీల్దార్లు బడానాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ ప్రభుత్వ భూములు అప్పనంగా వారికి కట్టబెడుతున్నారు.రెవెన్యూ అధికారులపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు శూన్యం. కనీసం విచారణ చేయడం లేదు. పోలీస్‌శాఖ క్రమ శిక్షణకు మారుపేరు. ఆ శాఖ గాడితప్పింది. ప్రతి పోలీస్‌స్టేషన్ ఒక సెటిల్‌మెంట్‌కు అడ్డాగా మారింది. నిత్యం సివిల్, ఇతర వ్యవహారాల్లో తల దూరుస్తూ వారి విధులు పూర్తిగా మర్చిపోయారు.ఇటీవల ఏసీబీ రైడ్‌లో సైతం పలువురు ఉద్యోగులు పట్టుబడిన విషయం తెలిసిందే. గంజాయి, ఇసుక దందాలు జోరుగా కొనసాగుతున్నాయి. వైద్యశాఖలో నిధుల గోల్‌మాల్ అయ్యాయి. నకిలీ మందులు అమ్ముతున్నా చర్యలు శూన్యం. పుట్టగొడుగులా మందుల దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. వాటిపై నియంత్రణ కరువవడంతో డ్రంగ్స్ దందా జోరుగా కొనసాగుతున్నది. సిద్దిపేట జిల్లా పత్తి కొనుగోళ్లలో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంలో భారీగా కుంభకోణం జరిగింది. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేవడంతో పలువురు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది.జిల్లాలో నకిలీ విత్తనాల దందా జోరుగా కొనసాగుతున్నది. కనీసం దానిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నామమాత్రంగా దాడులు చేస్తున్నారు తప్పా మరోటి లేదు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందడం లేదు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అందించే పథకాలకు మామూళ్లు తడపనిదే పనికావడం లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే డబ్బులు ఇస్తేనే ఇల్లు మంజూరవుతున్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, చెత్త సేకరణ, నర్సరీలు, మొక్కల పెంపకం, వీధి లైట్లు, డంపుయార్డులు, వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులు పనులు చేయలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. కొత్త కలెక్టర్లు తమ సామర్థ్యంతో సమస్యలు పరిష్కరించడంతో పాటు మెరుగైన పాలన అందించాలని ప్రజలు ఆశపడుతున్నారు.

## సకాలంలో అందని పాఠ్యపుస్తకాలు



- ఇప్పటికీ చేరని యూనిఫామ్స్
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



టేక్మాల్, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోటు పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నాం. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం అంటూ పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా సౌకర్యాలు, వసతులు ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభం కంటే ముందుగానే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫామ్స్ పాఠశాలలకు చేరాలి. ప్రారంభం రోజునే వాటిని విద్యార్థులకు అందజేయాలి. అది వాస్తవంగా కార్యరూపం దాల్చడం లేదు. టేక్మాల్ మండలంలో 36 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు కేజీబీవీ, మోడల్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు నడుస్తున్నాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో కలిపి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 4432 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో 170 మంది చిన్నారులు కొత్తగా పాఠశాలలో చేరారు. అన్ని తరగతుల విద్యార్థులకు 21,052 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా నేటి వరకు 18,804 మాత్రమే వచ్చాయి. 24వేల నోటు పుస్తకాలు మండలానికి చేరాయి. ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందజేయాల్సి ఉంది. అన్ని పాఠశాలల విద్యార్థులకు ఒక్కో జత అందించినట్లుగా రికార్డులో చూపుతున్నారు. వాస్తవానికి చాలా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్స్ అందలేదు. ఇప్పటికైనా విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- **రేజింతల్ గ్రామ శివారులోని మామిడి వాగుపై వంతెన లేక ఇక్కట్లు**
- **వర్షాకాలం వచ్చిందంటే భయం గుప్పిట్లో కర్ణాటక, తెలంగాణ ప్రయాణికులు, భక్తులు**

## వాగుకు వరదొస్తే రాకపోకలు బంద్

- **బ్రిడ్జి నిర్మాణానికి ఏండ్లుగా ఎదురు చూపులు**



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ శివారులోని మామిడి వాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి ఉధృంతంగా ప్రహిస్తున్న వరద (ఫైల్)

జహీరాబాద్, జూన్ 14: భారీవర్షాలు కురిస్తే వచ్చే వరదతో న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని మామిడి వాగుపై ఉన్న లోలెవల్ కల్వర్టుపై నుంచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ కల్వర్టు మార్గం గుండా రాకపోకలు సాగించే తెలంగాణ, కర్ణాటక ప్రాంతానికి చెందిన ప్రయాణికులు, భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం ఈ కల్వర్టు మార్గం గుండా ఝరాసంగం మండలంలోని కేతకీ సంగమేశ్వర స్వామి, రేజింతల్ సిద్ధివినాయక స్వామి ఆలయాల దర్శించుకునేందుకు ఇరు రాష్ట్రాల భక్తులు వస్తుంటారు. ప్రతిసారి వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు ఈ కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగా ప్రహిస్తున్నది. వరద ఉధృతి తగ్గే వరకు రెండు, మూడు రోజుల పాటు కల్వర్టు మార్గంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మూడేండ్ల క్రితం వరద ఉధృతంగా ప్రహించగా ఝరాసంగం మండలానికి చెందిన వాహనచోదకుడు గల్లంతై మృతి చెందాడు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు బందోబస్తు నిర్వహిస్తుంటారు. మామిడివాగుపై ఉన్న లోలెవల్ కల్వర్టుపై వంతెన నిర్మించాలని గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రతిసారి వర్షాకాలంలో వరద ఉధృతికి రోజుల తరలబడి రాకపోకలు బంద్ అవుతున్నా వంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ఏండ్లుగా అధికారులు చూసి వెళ్తున్నారు తప్పా వంతెన నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులపై తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గమ్యస్థానాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు

## బాధ్యతలు స్వీకరించిన సిద్దిపేట కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

- **కలెక్టర్ హైమావతికి అధికారుల స్వాగతం**

సిద్దిపేట, జూన్ 14: ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, కార్యక్రమాలు పక్కాగా అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.హైమావతి అన్నారు. శనివారం సిద్దిపేటలోని సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. కొత్త కలెక్టర్ హైమవతికి జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఛాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనం తీసుకొని కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పరిచయం చేసుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళ్లిన కలెక్టర్ మనుచౌదరిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.



హైమావతికి స్వాగతం చెబుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్